నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, బుధవారం 16 అక్టోబర్ 2024 | KHAMMAM

ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా? వ్యాపారాలు ఎలా నడుస్తున్నాయ్? ఆటో డ్రైవర్లు, దుకాణదారులతో ఖమ్మం కలెక్టర్ ఖాన్ మాటామంతీ

నమస్కారం.. నేను మీ కలెక్టర్‌ని..

ఖమ్మం, అక్టోబర్ 15 : 'నమస్కారం.. బాగున్నారా? నేను.. మీ జిల్లా కలెక్టర్‌ని..' అని పరిచయం చేసుకుంటూ స్థానిక ఆటోడ్రైవర్లు, దుకాణదారులను పలుకరించారు ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్. 'వ్యాపారం ఎలా నడుస్తున్నది' అంటూ వ్యాపారులను, 'ఇక్కడి నుంచి ఎక్కడి వరకు ఆటోలు నడుపుతారు?' అంటూ ఆటోడ్రైవర్లను అడిగి తెలుసుకున్నారు. ఖమ్మం నగరంలో మంగళవారం ఆకస్మికంగా పర్యటించిన కలెక్టర్.. పాత బస్టాండ్‌ను ఆనుకొని షాదీఖానా వెళ్లే రోడ్డులో ఉన్న ఫుట్‌పేవ్ షాపులోకి వెళ్లారు. 'వ్యాపారం ఎలా ఉంటున్నది? రోజు వారీ ఆదాయం ఎంత ఉంటున్నది? కుటుంబ పోషణ ఎలా జరుగుతున్నది? పిల్లల చదువులు ఎలా ఉన్నాయి?' అంటూ షాపు యజమాని సయ్యద్ బిలాల్ పాషాను అడిగి తెలుసుకున్నారు. 'చెప్పుల స్టాక్ ఎక్కడి నుంచి తెస్తారు? దానికి పెట్టుబడి ఎలా వస్తుంది?' అనే వివరాలపై ఆరా తీశారు. వ్యాపారాల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తర్వాత అదే పాత బస్టాండ్ సిగ్నల్ ప్రాంతం వద్ద ఆగి ఉన్న ఆటో స్టాండ్ వద్దకు వెళ్లి అక్కడి ఆటోడ్రైవర్లతో ముచ్చటించారు. 'రోజుకు ఎంత సంపాదిస్తున్నారు? వచ్చే ఆదాయం కుటుంబ పోషణకు సరిపోతున్నదా? ఆటో సొంతానిదా? కిరాయిదా?' అంటూ వివరాలు అడిగారు.

ఆటో డ్రైవర్లతో ముచ్చటిస్తున్న ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

అయితే, స్వయంగా కలెక్టరే వచ్చి తమతో ముచ్చటించడం; వ్యాపార, కుటుంబ పోషణ వంటి వివరాల గురించి వాకబు చేయడం వంటి వాటితో దుకాణదారులు, ఆటో డ్రైవర్లు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా 'సమస్యలేమైనా ఉన్నాయా?' అనే కలెక్టర్ ప్రశ్నకు ఆటోడ్రైవర్లు స్పందించారు. ఆటో కార్మికులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, ఆటో అడ్డాలు పెంచాలని, వసతులు ఏర్పాటు చేయాలని కోరారు. అందుకు కలెక్టర్ స్పందిస్తూ.. వీలైనంత త్వరగా ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మాటిచ్చారు.

పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పొంగులేటి, పక్కన ఎమ్మెల్యే, కలెక్టర్

పంచాయతీలతోనే
మెరుగైన పాలన

రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
నూతన పంచాయతీ, అంగన్‌వాడీ భవనాలు ప్రారంభం

బూర్గంపహాడ్, అక్టోబర్ 15 : గ్రామీణ ప్రజలకు పంచాయతీలతోనే మెరుగైన పాలన అందుతుందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. తాళ్లగొమ్మూరు పంచాయతీలో రూ.20 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించిన నూతన పంచాయతీ భవనం, ఐటీసీ నిధులు రూ.12 లక్షల వ్యయంతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తున్నదని అన్నారు. ప్రజలు ఏ సమస్య ఉన్నా నేరుగా పంచాయతీ కార్యాలయానికి వచ్చి పరిష్కరించుకోవచ్చన్నారు. గర్భిణులు, చిన్నారులు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారంతో పాటు సకల సౌకర్యాలు అందుతున్నాయని అన్నారు. తొలుత మోరంపల్లిబంజరకు చేరుకున్న మంత్రి పొంగులేటికి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, మండల కాంగ్రెస్ నాయకులు పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. మణుగూరు క్రాస్ రోడ్ వద్ద కూడా ఆయనకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు, కోరం కనకయ్య, జారే ఆదినారాయణ, కలెక్టర్ జితేశ్ వి పాటిల్, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాస్, డీసీసీబీ మాజీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, డీఎస్పీ సతీశ్‌కుమార్, సీఐ వినయ్ కుమార్, ఎస్సైలు రాజేష్, కిన్నెర రాజశేఖర్, తహసీల్దార్ ముజాహిద్, ఎంపీడీవో జమలారెడ్డి, ఎంపీవో సునీల్ శర్మ, ఐసీడీఎస్ సీడీపీవో రేవతి, పీఆర్ డీఈ పొదెం వెంకటేశ్వర్లు, ఐటీసీ హెచ్ఆర్ హెడ్ శ్యామ్‌కిరణ్, అడ్మిన్ మేనేజర్ చెంగల్‌రావు, ఈవో మహేశ్, పంచాయతీ కార్యదర్శి తలగాని మురళి పాల్గొన్నారు.

- డీఎస్సీ-2024 టీచర్లకు పోస్టింగ్‌లు
- అర్ధరాత్రి వరకు జరిగిన ప్రక్రియ
- డీఈవో సోమశేఖర శర్మ పర్యవేక్షణ

సందిగ్ధం నడుమ కౌన్సెలింగ్

డీఎస్సీ-2024లో ఎంపికైన ఉమకు నియామక ఉత్తర్వులు అందజేస్తున్న ఖమ్మం డీఈవో సోమశేఖరశర్మ

ఖమ్మం, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : నోటిఫికేషన్ వెలువడడం, పరీక్ష రాయడం, ఫలితాలు రావడం, సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి కావడం, 1:1 నిష్పత్తిలో జాబితా వెలువడడం.. వెరసి తాజాగా పోస్టింగ్‌ల ఉత్తర్వులు అందుకోవడం. ఇదీ.. డీఎస్సీ-2024 అభ్యర్థులు 'కొలువు'దీరిన ప్రక్రియ. తాజా డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులకు కౌన్సెలింగ్ ప్రక్రియ సందిగ్ధం మధ్య కొనసాగింది. ఎట్టకేలకు ఆయా అభ్యర్థులు మంగళవారం పోస్టింగ్‌ల ఉత్తర్వులు అందుకున్నారు. ఖమ్మంలోని డైట్ కళాశాలలో 520 మంది ఉపాధ్యాయులకు సంబంధించిన స్కూల్ అసిస్టెంట్, ఎస్‌జీటీ, ఇతర కేటగిరీల్లో ఆయా అధికారులు మంగళవారం నియామక పత్రాలను అందజేశారు. తొలుత ఉపాధ్యాయులు ఉదయం 10 గంటలకే చేరుకున్నప్పటికీ.. కౌన్సెలింగ్ వాయిదా పడిందంటూ అధికారులు ప్రకటించడంతో ఉసూరుమంటూ వెనుదిరిగారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్టు మళ్లీ మధ్యాహ్నం సమాచారం ఇచ్చారు. దీంతో మరోసారి వారంతా చేరుకున్నారు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో ప్రారంభమైన కౌన్సెలింగ్.. అర్ధరాత్రి 12 గంటల వరకు కొనసాగింది.

సందిగ్ధం నడుమ..

డీఎస్సీ-2024లో ప్రతిభ కనబర్చి కొలువులు సాధించి హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో ఉత్తర్వులు అందుకున్న ఉపాధ్యాయులు.. పోస్టింగ్‌లు పొందేందుకు ఎంతో ఆతృతగా, ఆనందంగా మంగళవారం ఉదయం 9 గంటలకే ఖమ్మంలోని డైట్ కళాశాలకు చేరుకున్నారు. ఉపాధ్యాయ కొలువులో చేరేందుకు సమయం ఆసన్నమైందనుకున్న సమయంలో ఒక్కసారిగా వారి ఆశలపై నీళ్లు చల్లినట్లుగా ఓ ప్రకటన వచ్చింది. కౌన్సెలింగ్ వాయిదా పడిందని, మళ్లీ ఎప్పుడు నిర్వహిస్తామనే విషయంపై తర్వాత సమాచారం ఇస్తామని ఉదయం 10 గంటలకు అధికారులు పేర్కొన్నారు. దీంతో చివరి నిమిషంలో ఇలా జరిగిందేంటనుకుంటూ అభ్యర్థులు ఆందోళనతో వెనుదిరిగారు. అధికారులు కూడా ఉన్నతాధికారుల ఆదేశాలతో కొంత గందరగోళంలో పడ్డారు. ఏం జరుగుతుందో తెలియక దూరప్రాంతాల నుంచి వచ్చిన అభ్యర్థులు అసహనంతో వెనుదిరిగారు. మళ్లీ మధ్యాహ్నం 12:30 గంటల ప్రాంతంలో కౌన్సెలింగ్ నిర్వహించేందుకు ఉన్నతాధికారుల నుంచి అనుమతి వచ్చింది. దీంతో కౌన్సెలింగ్ ఉంటుందని, అభ్యర్థులు హాజరుకావాలని డీఈవో సోమశేఖర శర్మ ప్రకటించారు. అయితే, అభ్యర్థులు వెళ్లిపోయారని, బుధవారం నిర్వహించాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు కోరారు. అయితే, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారమే ఉత్తర్వులు ఇవ్వాల్సి ఉందని స్పష్టం చేయడంతో అభ్యర్థులు సాయంత్రం వరకు కౌన్సెలింగ్ ప్రదేశానికి వస్తూనే ఉన్నారు.

అర్ధరాత్రి వరకూ ప్రక్రియ..

ప్రభుత్వ, పరిషత్ స్కూళ్లకు వేర్వేరుగా కౌంటర్లు ఏర్పాటు చేసి కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించారు. ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్లకు ప్రత్యేకంగా త్వరితగతిన ప్రక్రియ పూర్తయ్యేలా ఏర్పాటు చేశారు. అనుభవం కలిగిన సీనియర్ హెచ్ఎంలు, కంప్యూటర్ నైపుణ్యం కలిగిన డీఈవో కార్యాలయ సిబ్బంది, ఎంఈవోల ఆధ్వర్యంలో తొలుత అభ్యర్థులకు మెరిట్ ఆధారంగా కౌన్సెలింగ్ ప్రక్రియను పూర్తి చేశారు. డీఎస్సీకి ఎంపికైన ఉత్తర్వుల కాపీ, కౌన్సెలింగ్‌లో ఆప్షన్ పేపర్, నాలుగు ఫొటోలను తీసుకుని సబ్జెక్టుల వారీగా నియామక గురించి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చే గర్భిణులకు సుఖప్రసవం జరిగేలా వైద్యులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రిలో రికార్డులను పరిశీలించారు. ఆవరణలో నూతనంగా నిర్మించిన వంద పడకల ఆసుపత్రిని పరిశీలించి త్వరలోనే అన్ని మౌలిక సదుపాయాలు కల్పించి ఆసుపత్రిని ప్రారంభిస్తామన్నారు. ఆమె వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో టీ.సీతారాం, వైద్యులు కే.వెంకటేశ్వర్లు, సురేష్, నారాయణ, ప్రణయ్, జయలక్ష్మి, రాజేష్, సాంబశివరావు, నారాయణమ్మ, ప్రేమలత, గీస్మిత, ఏఎన్ఎంలు, సిబ్బంది ఉన్నారు.

కౌన్సెలింగ్‌కు హాజరైన డీఎస్సీ-2024 అభ్యర్థులు

భద్రాద్రి జిల్లాలో...

కొత్త గూడెం ఎడ్యుకేషన్, అక్టోబర్ 15 : డీఎస్సీ-2024లో ఎంపికైన అభ్యర్థులకు ఉపాధ్యాయులుగా నియామక పత్రాలను డీఈవో వెంకటేశ్వరాచారి మంగళవారం సాయంత్రం అందజేశారు. పాత కొత్తగూడెంలోని ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ఏర్పాటు చేసిన కౌన్సెలింగ్‌కు వచ్చిన అభ్యర్థులకు కొన్ని అనివార్య కారణాల వల్ల కౌన్సెలింగ్ వాయిదా వేస్తున్నట్లు అధికారులు తొలుత ప్రకటించారు. దీంతో ఉదయం వచ్చిన అభ్యర్థులు నిరాశతో వెనుదిరిగారు. మళ్లీ అధికారులు మధ్యాహ్నం 2 గంటల నుంచి కౌన్సెలింగ్ ఉంటుందని చెప్పడంతో అభ్యర్థులు ఉరుకులు పరుగులతో పాఠశాల వద్దకు చేరుకున్నారు. కౌన్సెలింగ్‌కు హాజరైన అభ్యర్థుల మెరిట్ ఆధారంగా వారికి పాఠశాలలను కేటాయిస్తూ నియామక పత్రాలను డీఈవో అందజేశారు.

రిపోర్ట్ చేసేందుకు 15 రోజుల గడువు..

డీఎస్సీ-2024 పోస్టింగ్ ఉత్తర్వులు అందుకున్న టీచర్లు ఆయా పాఠశాలల్లో రిపోర్ట్ చేసేందుకు విద్యాశాఖ 15 రోజుల గడువు ఇచ్చింది. నియామకపత్రాలు అందుకున్న టీచర్లకు సంక్రాంతి సెలవుల్లో ఎస్సీఈఆర్‌టీ అధ్యాపకుల నేతృత్వంలో శిక్షణ ఉండొచ్చని డీఈవో సోమశేఖర శర్మ పేర్కొన్నారు. కాగా.. గతంలో శిక్షణ ఇప్పించి పోస్టింగ్‌లు ఇచ్చి స్కూళ్లకు పంపేవారు.

తల్లిదండ్రులు, భర్త ప్రోత్సాహంతో..

ఇద్దరు పిల్లల ఆలనాపాలనా చూసుకుంటూనే కష్టపడి చదివి టెట్‌లో ఫస్ట్ ర్యాంక్, డీఎస్సీలో జిల్లా రెండో ర్యాంక్ సాధించాను. తల్లిదండ్రులు, భర్త ప్రోత్సాహంతోనే టీచర్ కొలువు తెచ్చుకోగలిగాను. ఖమ్మంలోని ఎన్ఎస్సీ కాలనీ పాఠశాలలో ఎస్‌జీటీగా నియామక పత్రం తీసుకోవడం ఎంతో సంతోషంగా ఉంది. మంచి ఉపాధ్యాయురాలిగా రాణిస్తా. విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దుతా.

-వలసాల ఉమ, ఎస్‌జీటీ

తెలంగాణ నాకు మరో జీవితాన్నిస్తోంది..

నాది రాజమండ్రి. డీఎస్సీలో ఫస్ట్ ర్యాంక్ సాధించడంతో నాన్‌లోకల్ కోటాలో నాకు ఉద్యోగం వచ్చింది. చాలా ఆతృతతో నిన్న రాత్రి ఖమ్మం చేరుకున్నా. ఉద్యోగం సాధించడంతో చాలా సంతోషంగా ఉంది. తెలంగాణ రాష్ట్రం నాకు మరో జీవితాన్ని ఇస్తోంది. ఇక్కడే స్థిరపడతాం.

-మణికుమారి, ఎస్ఏ హిందీ, రాజమండ్రి

నాన్న, మామయ్య స్ఫూర్తితోనే..

మా నాన్న హెచ్ఎం, మా మామయ్య రిటైర్డు హెచ్ఎం. నా చిన్నతనం నుంచి వారిని చూస్తూ పెరిగాను. వారి మాదిరిగానే టీచర్ కావాలనే కోరిక ఉండేది. డిగ్రీ ఫైనలియర్‌లోనే పెళ్లి అయ్యింది. నా భర్త నా లక్ష్య సాధనకు బాటలు వేస్తూ.. ఇద్దరు పిల్లలు పుట్టిన తర్వాత డీఈడీ చదివించారు. రెండు సార్లు టెట్ క్వాలిఫై అయ్యి డీఎస్సీ కోసం ఎదురు చూస్తుండగా ఇటీవల నోటిఫికేషన్ ద్వారా ఉద్యోగం సాధించాను. పోస్టింగ్ ఆర్డర్ తీసుకోవడం ఎంతో సంతోషంగా ఉంది.

-దూళ్ల సౌజన్య, సత్తుపల్లి

ప్రజలకు మెరుగైన
వైద్యసేవలు అందించాలి

ఖమ్మం అదనపు కలెక్టర్ శ్రీజ

సత్తుపల్లి, అక్టోబర్ 15 : ప్రభుత్వ వైద్యశాలకు వచ్చే ప్రజలకు వైద్యులు నిత్యం అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ పీ.శ్రీజ అన్నారు. మంగళవారం ఆమె సత్తుపల్లి ఏరియా ఆసుపత్రి, గంగారం పీహెచ్‌సీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో ఓపీ విభాగం, రక్త పరీక్ష నమూనా విభాగం, డయాలసిస్ కేంద్రాలను సందర్శించి అక్కడి రోగులతో ఆసుపత్రిలో అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. సత్తుపల్లి ఆసుపత్రి ఆవరణలో ఉన్న సిమాంక్ సెంటర్‌ను సందర్శించి గర్భిణులకు అందుతున్న వైద్యసేవల

రోగులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ

మరోసారి ముప్పు వాటిల్లకుండా రిటైనింగ్ వాల్ నిర్మాణం
స్టార్మ్ వాటర్ డ్రెయిన్ నిర్మాణ పనుల శంకుస్థాపనలో మంత్రి తుమ్మల
ఆదర్శ నగరంగా ఖమ్మం

ఖమ్మం, అక్టోబర్ 15 : రాష్ట్రంలోనే ఆదర్శ నగరంగా ఖమ్మాన్ని తీర్చిదిద్దాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఖమ్మం 46వ డివిజన్ సారథిగర్‌లో టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.కోటితో చేపట్టిన స్మార్ట్ వాటర్ డ్రెయిన్ నిర్మాణ పనులకు మంత్రి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మున్నేరు వరద నుంచి మరోసారి ముప్పు వాటిల్లకుండా ఉండేందుకు రిటైనింగ్ వాల్ డిజైన్ కోసం నిపుణుల కమిటీని నియమించాలని ముఖ్యమంత్రిని కోరామని, భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపడుతుందన్నారు. ఆక్రమణలో ఉన్న పేదల ఇళ్లు, ఇళ్ల స్థలాలు మరోచోట అందించి.. వారిని అక్కడి నుంచి తరలించిన తర్వాతే ఆక్రమణలను తొలగించాలని మంత్రి సూచించారు. ఖమ్మం నగరానికి అవసరమైన నిధులు ముఖ్యమంత్రిని అడిగి తీసుకొస్తానని, పరిశుభ్రమైన, ఆరోగ్యవంతమైన నగరంగా తీర్చిదిద్దాలన్నారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మేయర్ నీరజ, కేఎంసీ కమిషనర్ అభిషేక్, కార్పొరేటర్లు కన్నం వైష్ణవి, కమర్తపు మురళి తదితరులు పాల్గొన్నారు.

స్టార్మ్ వాటర్ డ్రైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి తుమ్మల

సీసీఐ.. కొనుగోళ్లు నై!

- కొత్త పత్తి చేతికొస్తున్నా కనిపించని కేంద్రాలు
- ఖమ్మం మార్కెట్‌కు భారీగా పత్తి బస్తాల రాక
- ప్రైవేటు వ్యాపారులకు అమ్ముతూ నష్టపోతున్న రైతులు
- క్వింటాకు రూ.500-700 వరకు నష్టం
- కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర కల్పించాలని రైతుల డిమాండ్

ఖమ్మం వ్యవసాయం, అక్టోబర్ 15 : జిల్లాలో వారం, పది రోజులుగా పత్తి పంట చేతికొస్తున్నా కొనుగోలు కేంద్రాల జాడ కనిపించడం లేదు. పంట సీజన్‌కు ముందుగానే కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉండగా.. ఆ దిశగా అడుగులు ముందుకు పడలేదు. దీంతో మొదటి తీతను పూర్తి చేసిన రైతులు ఇంట్లో నిల్వ చేసుకోలేక తమ పంటను ప్రైవేటు వ్యాపారులు, దళారులకు అమ్ముకుంటూ తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ ఏడాది వానకాలంలో వివిధ రకాల పంటలు సాగు చేసిన రైతులకు ఏమాత్రం కలిసి రాలేదని చెప్పొచ్చు. భారీ వర్షాలు, వరదలతో ఒకవైపు పంటలు దెబ్బతినగా, మరోవైపు పంటలను చీడపీడలు ఆశించడంతో దిగుబడులపై ప్రభావం చూపింది. దీంతో మిర్చి తోటలు, వరి పొలాలతోపాటు అక్కడక్కడా పత్తి కాయలు రాలిపోవడం, దూది రంగు మారడంతో భారీగా నష్టం వాటిల్లింది. జిల్లాలో ఈ ఏడాది రైతులు 2 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. దాని ద్వారా దాదాపు 1.80 లక్షల మెట్రిక్ టన్నుల పంట దిగుబడి వచ్చే అవకాశం ఉంటుందని అధికారులు అంచనా వేశారు.

కొనుగోళ్లపై సమీక్షలతోనే సరి..

జిల్లాలో పత్తి పంట దిగుబడిని బట్టి కొనుగోళ్ల కోసం ఇప్పటికే పలుమార్లు సీసీఐ కేంద్రాలు, కావాల్సిన మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై అధికారులు జిల్లాస్థాయిలో సమీక్షలు నిర్వహించారు. అయితే అధికారులు ఊహించినదాని కంటే ముందుగానే అంటే.. గడిచిన పక్షం రోజులుగా రైతులు పత్తి పంటను విక్రయానికి మార్కెట్‌కు తరలిస్తున్నారు. జిల్లాలో అడపా దడపా కురుస్తున్న అకాల వర్షాలు, తేమ శాతం లేదా మరే కారణమోగానీ ఇప్పటివరకు సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేదు. ఈ ఏడాది వివిధ మార్కెట్ల పరిధిలో ఉన్న తొమ్మిది జిన్నింగ్ మిల్లుల వద్ద సీసీఐ కేంద్రాల ఏర్పాటుకు సైతం అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అయితే ప్రైవేట్ ఖరీదుదారులు పత్తి పంటను భారీగా కొనుగోలు చేస్తున్నా.. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో మార్కెట్ యార్డుకు పత్తి పంటను తీసుకొచ్చిన రైతులు అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు తమ పంటను దళారులకు విక్రయించాల్సి వస్తున్నది. అప్పు చేసి సాగుకు పెట్టుబడి పెట్టిన రైతులు వడ్డీలు కట్టలేక చేతికొచ్చిన పంటను వెంటనే అమ్ముకోవాల్సి వస్తున్నది. దీనిని ఆసరా చేసుకున్న దళారులు అందిన కాడికి రైతులను దోచుకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు.

ఖమ్మం మార్కెట్‌లోని పత్తి యార్డుకు రైతులు తీసుకొచ్చిన కొత్త పత్తి బస్తాలు

విక్రయానికి 3 వేల బస్తాల రాక..

ఖమ్మంలోని వ్యవసాయ మార్కెట్ పరిధిలో గల పత్తి యార్డుకు ఆయా మండలాలకు చెందిన రైతులు మంగళవారం రికార్డు స్థాయిలో 3 వేల పత్తి బస్తాలను విక్రయానికి తరలించారు. ఈ ఏడాది సీసీఐ క్వింటా పత్తికి మద్దతు ధర రూ.7,500 నిర్ణయించగా.. ఉదయం జరిగిన ఆన్‌లైన్ బిడ్డింగ్‌లో క్వింటా గరిష్ట ధర రూ.7 వేలు పలికింది. మధ్య ధర క్వింటాల్ రూ.6,700 కాగా, కనిష్ట ధర రూ.5,500గా నిర్ణయించి ప్రైవేట్ ఖరీదుదారులు పత్తిని కొనుగోలు చేశారు. అదే.. సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేస్తే క్వింటాకు రూ.500 నుంచి రూ.700 వరకు అదనంగా రైతులకు ధర లభించే అవకాశం ఉంది. ఇప్పటికైనా సీసీఐ అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధర కల్పించాలని ఆయా మండలాలకు చెందిన పత్తి రైతులు డిమాండ్ చేస్తున్నారు.

రెండు, మూడు రోజుల్లో ప్రారంభిస్తాం..

సీసీఐ కేంద్రాలను ప్రారంభించడానికి అన్ని రకాల చర్యలు తీసుకున్నాం. ఏర్పాటు చేయనున్న కేంద్రాలకు సంబంధించి సాఫ్ట్‌వేర్ ఇన్‌స్టాల్ కార్యక్రమం నడుస్తున్నది. కేంద్రాల్లో పూర్తి మౌలిక వసతులు ఏర్పాటు చేసి రెండు, మూడు రోజుల్లో కేంద్రాలను రైతులకు అందుబాటులోకి తీసుకొస్తాం. పత్తిని పూర్తిగా ఆరబెట్టుకొని నాణ్యమైన కేంద్రాలకు తరలిస్తే మంచి ధర పొందే అవకాశం ఉంటుంది.

-ఎంఏ అలీం, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి, ఖమ్మం

రీయింబర్స్‌మెంట్ ఇస్తేనే కాలేజీలు తెరుస్తాం

ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్యాల స్పష్టీకరణ

ఖమ్మం ఎడ్యుకేషన్, అక్టోబర్15: రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేస్తేనే కాలేజీలు తెరుస్తామని ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్యాల సంఘం బాధ్యులు గుండాల కృష్ణ, మద్ది ప్రభాకర్‌రెడ్డి, కాటేపల్లి నవీన్, వీ.మోహన్‌రెడ్డి, కోటా అప్పిరెడ్డి స్పష్టం చేశారు. నిధులు ఇవ్వకుండా ప్రభుత్వం తమను ఒత్తిడి తెస్తే తాము చావడానికైనా సిద్ధమవుతాము తప్ప కళాశాలలను మాత్రం తెరవబోమని తేల్చిచెప్పారు. సంఘం బాధ్యులంతా కలిసి ఖమ్మంలోని ఓ ఫంక్షన్ హాల్లో మంగళవారం సమావేశమై భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకున్నారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ప్రైవేట్ విద్యాసంస్థలకు అండగా ఉంటామని, ప్రోత్సాహాన్ని అందిస్తామని ఎన్నికల సమయంలో హామీలిచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు కనీసం అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వకుండా దుర్మార్గంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ మొండి వైఖరి వల్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకు పోయాయని తాము ఇబ్బందులు పడుతున్నామని, పేద విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

రెండో రోజూ బంద్..

రెండో రోజైన మంగళవారం కూడా జిల్లాలో ఏ ఒక్క విద్యాసంస్థ తెరుచుకోలేదని, కళాశాలల్లో ఆఫీస్ వర్క్ కూడా నడవలేదని ప్రియదర్శిని విద్యాసంస్థల అధినేత కాటేపల్లి నవీన్‌బాబు అన్నారు. దసరా నాటికి చెల్లింపులు చేస్తామని చెప్పిన ప్రభుత్వం.. మాట తప్పిందని ఆరోపించారు. విద్యాసంస్థల బాధలను ప్రభుత్వం పట్టించుకోవట్లేదు కాబట్టి తాము ఈ ఆందోళనను ఉధృతం చేస్తామని డీఆర్ఎస్ కళాశాల కరస్పాండెంట్ వీ.మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. పార్టీలు, విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాల మద్దతు, సహకారంతో ఆందోళనను కొనసాగిస్తామని అన్నారు. గాయత్రి కళాశాల కరస్పాండెంట్ కుతుంబాక సునీల్‌కుమార్, కిరణ్ శౌరి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆర్జేసీ కృష్ణ, చిత్రంలో మోహన్‌రెడ్డి, నవీన్, అప్పిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సునీల్